హైదరాబాద్ వార్త



# సెకండ్ హ్యాండ్ కార్లే సో బెటరూ!

-తక్కువ ధరలో అదిరిపోయే కార్లు
-హైదరాబాద్ రహదారులపై ఢిల్లీ బండ్లు రయ్ రయ్
-అక్కడ కాల పరిమితి ముగిసిన వాహనాలకు ఇక్కడ గిరాకీ
-నగరానికి తరలించి విక్రయిస్తున్న ఏజెంట్లు



**హైదరాబాద్, జులై 5, ప్రభాతవార్త**

ఢిల్లీ బండ్లు హైదరాబాద్ రోడ్లపై పరుగులు తీస్తున్నాయి. అక్కడ కాలపరిమితి ముగిసిన వాహనాలు నగరంలో జోరుగా అమ్ముడవుతున్నాయి. తక్కువ ధరల్లో లభిస్తుండటంతో నగరవాసులు వెనుకడుగు వేయకుండా కొనుగోలు చేస్తున్నారు. సెకండ్ హ్యాండ్ వాహనాలే అయినప్పటికీ కండీషన్ బాగా ఉన్నవి కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నాయి. సెకండ్ హ్యాండ్ వాహనాల దందా ఏజెంట్లకు లాభసాటిగా మారింది.

**తక్కువ ధరలకు లభిస్తుండటంతో....**

-ఇటీవల ఢిల్లీ సర్కారు పెట్రోల్, డీజిల్ వాహనాలపై ఆంక్షలను కఠినతరం చేసింది. కొద్ది రోజుల క్రితమే ఈ వాహనాలకు పెట్రోల్ బంకుల్లో 'నో పెట్రోల్, నో డీజిల్' అంటూ నిబంధనలు విధించింది. ప్రస్తుతం కొన్ని సాంకేతిక కారణాలతో ఈ నిబంధనను వాయిదా వేసినప్పటికీ ఢిల్లీలో వాహన కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరినందు వల్ల పెట్రోల్, డీజిల్ వాహనాల వినియోగం ప్రశ్నార్థకంగా మారింది.దీంతోఈ వాహనాలకు హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో డిమాండ్ ఏర్పడింది.

-మరోవైపు తక్కువ ధరలకు లభిస్తుండటంతో చాలామంది ఆసక్తి చూపుతున్నారు. కానీ ఈ క్రమంలో కొందరు ఏజెంట్లు సెకండ్ హ్యాండ్ వాహనాల ముసుగులో ఊరూ పేరూ లేని వాహనాలను విక్రయించి భారీ ఎత్తున సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎలాంటి డాక్యుమెంట్లు, ఆధారాలు లేని వాహనాలకు సైతం నగరంలోని కొన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో తప్పుడు అడ్రస్‌లపై రిజిస్ట్రేషన్‌ల పునరుద్ధరణ జరుగుతోంది. దీంతో అటు ఏజెంట్లకు, ఇటు కొందరు ఆర్టీఏ అధికారులకు "సెకండ్ హ్యాండ్ బండి ఒక దందా"గా మారిందనే ఆరోపణలు ఉన్నాయి.

**డాక్యుమెంట్లు ఉంటే ఓకే..**

-ఒక రాష్ట్రంలో నమోదైన వాహనాలను మరో రాష్ట్రానికి తరలించేందుకు తప్పనిసరిగా రవాణా శాఖ అనుమతి అవసరం. వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, బీమా పత్రాలు, వాహన యజమాని చిరునామా ఉన్న వాటినే కొనుగోలు చేయాలి. అలా అన్ని డాక్యుమెంట్లు ఉన్నవాటికి మాత్రమే రవాణా అధికారులు నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) అందజేస్తారు. దీంతో ఆ వాహనాన్ని ఎక్కడైనా విక్రయించవచ్చు. కానీ కొందరు ఏజెంట్లు ఎలాంటి ఎన్ఓసీలు లేకుండా దొంగబండ్లను హైదరాబాద్ తరలిస్తున్నారు. ఇలాంటి వాహనాలపై గతంలో పోలీసులు పలు కేసులు నమోదు చేసి నిందితులపైన చట్టపరమైన చర్యలు సైతం తీసుకున్నారు.

-తాజాగా 15 ఏళ్లు ముగిసిన పెట్రోల్ వాహనాలు, 10 ఏళ్లు ముగిసిన డీజిల్ హనాలపై ఢిల్లీ రవాణాశాఖ ఆంక్షలను విధించింది. ప్రస్తుతానికి ఈ ఆంక్షలను సడలించారు. ఇలాంటి వాహనాల వినియోగాన్ని మాత్రం ప్రభుత్వం నిరుత్సాహపరుస్తోంది. దీంతో చాలామంది వాహన యజమానులు వాటిని తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే ఢిల్లీ బండ్లకు హైదరాబాద్‌లో మరోసారి గిరాకీ నెలకొంది. ఈ ముసుగులో కొందరు ఏజెంట్లు ఎలాంటి ఆధారాలు లేని వాహనాల విక్రయాలకు పాల్పడడం గమనార్హం.

**'వాహన్'లో నమోదు తప్పనిసరి...**

గ్రేటర్ హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో ప్రతి రోజు సుమారు 3000లకు పైగా వాహనాలు కొత్తగా నమో దవుతాయి. వాటిలో 600 నుంచి 800 వరకు ఇతర రాష్ట్రాలకు చెందిన సెకండ్ హ్యాండ్ వాహనాలే ఉన్నాయి. ప్రత్యేకించి సెకండ్ హ్యాండ్ కేటగిరీలో వ్యక్తిగత కార్ల కొనుగోళ్లు ఎక్కువ. ఈ కేటగిరీలో 70 శాతం కార్లు ఢిల్లీకి చెందినవే ఉన్నట్లు అంచనా. నగరంలో 15 ఏళ్లు దాటిన వ్యక్తిగత వాహనాల కాలపరిమితిని ప్రతి సంవత్సరం పొడిగించుకొనే అవకాశం ఉంది. ఈ వెసులుబాటును దృష్టిలో ఉం చుకొని 5 నుంచి 10 ఏళ్ల లోపు కాల పరిమితి కలిగిన ఢిల్లీ వాహనాలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఎలాంటి వాహనాలైనా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'వాహన్' వెబ్ సైట్‌లో నమోదై ఉంటేనే కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు

# చికెన్ చిక్కదు..గుడ్డు దొరకదు

-కిలో స్కిన్లెస్ ధర రూ.320లు, గుడ్డు రూ.8

**హైదరాబాద్, జులై 7 ప్రభాతవార్త**

సామాన్యుడికి అత్యంత అందుబాటులో ఉండే ఏకైక నాన్‌వెజ్ చికెన్, కోడిగుడ్లు. ప్రస్తుతం వీటి ధరలకు విపరీతంగా రెక్కలొచ్చాయి. కేవలం వారాల వ్యవధిలోనే ధరలు అమాంతం పెరిగిపోవడంతో మధ్యతరగతి, సామాన్య కుటుంబాల బడ్జెట్ తలకిందులవుతోంది. ముక్క లేనిదే ముద్ద దిగని నాన్ వెజ్ ప్రియులకు ఈ ధరల పెరుగుదల షాకిస్తోంది. గడిచిన వారం రోజులుగా మార్కెట్లో చికెన్ ధరలు గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. గతవారంలో కిలో స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.290లు-రూ.300లు మధ్య ఉండగా.. ప్రస్తుతం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఏరియాను బట్టీ రూ.310 నుంచి రూ.330 వరకూ అమ్ముతున్నారు. కొన్ని రిటైల్ అవుట్ లెట్లలో ఈ ధరలు మరింత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.చికెన్ మాత్రమే కాకుండా.. ప్రొటీన్ కోసం ప్రధానంగా తినే కోడిగుడ్ల రేట్లు కూడా పెరగడం సామాన్యుడికి గుబులు పుట్టిస్తోంది. నెల రోజుల క్రితం మార్కెట్లో రూ.6 నుంచి రూ.6.50 పైసల మధ్య పలికిన ఒక గుడ్డు ధర..ఇప్పుడు రిటైల్ మార్కెట్లో ఏకంగా రూ.7 నుంచి రూ.8లకు జంప్ అయింది. దీంతో ఒక ట్రే (30) గుడ్లు కొనాలంటే రూ.210-రూ.240 వరకూ ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఈ ధరల పెరుగుదలకు వ్యాపారులు, పౌల్ట్రీరంగ నిపుణులు ప్రధానంగా మూడు కారణాలు చెప్తున్నారు. ఉత్పత్తి మరియు సప్లై గణనీయంగా తగ్గిందని, పైగా కోళ్లకు మేతగా వేసే మొక్కజొన్న, సోయాబీన్ ధరలు పెరగడంతో పౌల్ట్రీ నిర్వహణ భారం పెరిగి పెంపకాన్ని తగ్గించారు. దీనికితోడు శుభకార్యాలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో హోటళ్లు, ఫంక్షన్ హాళ్ల నుంచి ఆర్డర్లు పెరిగాయి. సప్లై తక్కువగా ఉండి,



డిమాండ్ ఎక్కువగా ఉండటంతో రేట్లు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇప్పటికే నిత్యావసరాలు, వంటనూనెల ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యుడికి.. ఇప్పుడు చికెన్, గుడ్ల ధరలు కూడా తోడవ్వడంతో వీకెండ్ వస్తే ఏం చేయాలోనన్న పరిస్థితి వచ్చింది.

# బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించాలి

-రోడ్లు,ఫుట్‌పాత్‌లు పరిశుభ్రంగా ఉండాలి
:ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్, జులై 7 ప్రభాతవార్త**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) పరిధిలో కార్యక్రమాలు ముగిసిన వెంటనే బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించాలని కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, రహదారులు, ఫుట్‌పాత్‌లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.మంగళవారం ఎంఎంసి అదనపు కమిషనర్ (శానిటేషన్) రఘుప్రసాద్, డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్, డీఈ, ఏఈ, రామ్‌కీ సంస్థ ప్రతినిధులతో కలిసి బేగంపేట ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ, రహదారులు, ఫుట్‌పాత్‌ల పరిశుభ్రతను క్షేత్రస్థాయిలో కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఎలాంటి చెత్త, వ్యర్థాలు పేరుకుపోకుండా ప్రతిరోజూ సమగ్రంగా శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ చెత్త, వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించాలన్నారు. అదేవిధంగా ప్రజా ప్రదేశాల్లో నిర్వహించే కార్యక్రమాలు ముగిసిన వెంటనే ఏర్పాటు చేసిన బ్యానర్లు, ఫ్లెక్సీలు, ఇతర ప్రచార సామగ్రిని ఆలస్యం లేకుండా తొలగించి రహదారులు, ఫుట్‌పాత్‌లను పరిశుభ్రంగా, అవరోధాలు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కమిషనర్ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం కాలనీలో కొనసాగుతున్న రహదారి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారుల పక్కన నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలు పేరుకుపోవడాన్ని గమనించిన కమిషనర్, వాటిని తక్షణమే తొలగించి శాస్త్రీయ విధానంలో నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించడంతో పాటు నగర పరిశుభ్రత, సౌందర్య పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని కమిషనర్ సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు.



బేగంపేట,రైల్ నిలయం కాలనీలో పర్యటిస్తున్న ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, చిత్రంలో అదనపు కమిషనర్ రఘుప్రసాద్ తదితరులు

# అవినీతిమయంగా కూకట్‌పల్లి జోన్ ఇఇ, డీఇల కార్యాలయాలు

-ఘూనాపాటీల వసూళ్ల లీలలు..
ముడుపులిస్తేనే పనులు

**కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, జులై 7ప్రభాతవార్త:** సిఎంసి కూకట్‌పల్లి జోన్ కార్యాలయం పరిధిలోని కూకట్‌పల్లి, మూసాపేట, మాదాపూర్, ఆల్విన్‌కాలనీ సర్కిళ్ళఇఈలు, డీఇలు, ఏఇల కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. కీలక బాధ్యతల్ని నిర్వహించే కొందరు అధికారులు వసూల్ రాజాలుగా మారి తమ కింద పని చేసే ఏఇలు, ఉద్యోగులతో కాంట్రాక్టర్ల వద్ద వసూళ్ళకు తెరతీశారు. కొందరు అధికారులు కుమ్మక్కై పెద్దఎత్తున అక్రమార్జనకు పాల్పడుతూ కోట్ల అక్రమాస్తులు కూడబెడుతున్నా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)దృష్టి సారించడంలేదనే అభిప్రాయాలు వ్యక్త_ం అవుతున్నాయి.జేబులు నింపుకోవడానికే పరిమితమైన కొందరు అధికారులు అందిన మేరకు దండుకుంటున్నారు. ఇంజనీరింగ్ విభాగం అధికారుల కార్యాలయాల్లో ముడుపులు ఇస్తేనే ఫైళ్ళు ముందుకు కదులుతున్నాయి. ఇక్కడ కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్న అధికారులు ఇంజనీరింగ్ నియమ నిబంధనల్ని అమలు చేయకపోవడం వల్ల సీఎంసికిరూ.కోట్ల రూపాయల నష్టం వస్తోంది. కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం పరిధిలోని ఇఈలు, డీఇల కార్యాలయాలు అవినీతి, అక్రమ వసూళ్ళలో రికార్డు సృష్టిస్తున్నాయి. కార్యాలయల యాల్లో పెద్ద మొత్తంలో లక్షల రూపాయల మామూళ్ళు ఇవ్వనిదే ఫైళ్ళు కదలడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. సదరు అధికారులకురాజకీయ నాయకుల అండదండలతోపాటు సీఎంసి కార్యాలయం ఉన్నతాధికారుల ఆశీస్సులు పుష్కలంగా ఉండడంతో కొందరు అక్రమ వసూళ్ళకు పాల్పడుతూ అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయా పనుల మంజూరుకు సంబంధించిన ఫైళ్ళను సకాలంలో క్లియర్ చేయకుండా తాము అడిగినన్నీ మామూళ్ల ఇచ్చేంత వరకు సదరు అధికారులు క్లియర్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్ని అక్రమాలకు పాల్పడినా వారి సీట్లు పదిలంగా ఉండడంతో తమ ఇష్టారాజ్యంగా కార్యాలయాల్లో చక్రం తిప్పుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్ల నిర్మాణం అవినీతి పునాదుల్లో కూరుకుపోయింది. అభివృద్ధి పనుల్లో నాణ్యతా తుంగలో తొక్కడం గుత్తేదార్లకు పారిపాటిగా ఆరింది. కొన్ని పనులు కూడా సక్రమంగా జరిగిన దాఖలాలు కనిపించని పరిస్థితి నెలకొంది.



జోన్ కార్యాలయం

**కోసుకుపోయి గుంతలు పడ్డ రోడ్లు అత్యధికం.**

**గత సంవత్సరంలోపు నిర్మించినవే కావడం గమనార్హం.**

రోడ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టుపై కేటాయించడానికి నిబంధనలు పటిష్టంగానే ఉన్నా అమలులో అవి గాలికి కొట్టుకుపోతున్నాయి. పనులను కాంట్రాక్ట్‌కు ఇచ్చే సమయంలోనే అవినీతి అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. నామ్‌కే వాస్తేగా అధికారులు తనిఖీ, మొక్కుబడి పనులతో కాంట్రాక్టర్లు రోడ్డు నిబంధనలు పూరి_గా ఉల్లంఘిస్తున్నారు. డీఇల నుంచి ఎఇల వరకు కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు పర్సెంటేజీలు ఇవ్వాల్సి ఉండడంతో కాంట్రాక్టర్లు కూడా చేసేది ఏమిలేక అభివృద్ధిపనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. దీంతో వేసిన కొన్నాళ్ళకే రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయి. ఏ రోడ్లు చూసినా గతుకులతో నిండి గుంతలమయంగా మారి కంకరతో తేలియాడుతున్నాయి్దు. లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి ఇక్కడ పోస్టు దక్కించుకున్న అధికారులు తమ కిందిస్థాయి అధికారులు, సిబ్బంది కాంట్రాక్టర్లతో వసూళ్ల దందాకు దిగినట్టు ఆరోపణలు పెద్దఎత్తున వస్తున్నాయి.కొత్తగా వేస్తున్న రోడ్లను తనిఖీ చేసి నాణ్యత పాటించేలా కాంట్రాక్టర్లపై నిఘా ఉండేలా ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ఆయా ప్రాంతాల్లో వేసిన తారు, సిమెంట్ రోడ్డు పనులు నాణ్యత లేకుండా ముగింపచేసి కాంట్రాక్టర్లు, అధికారులతో కుమ్మకయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఇఈలు, డీఇల కార్యాలయాల్లో జరుగుతున్న , అవినీతి, అక్రమ వసూళ్ళపై అటు ఏసీబీ గాని ఇటు విజిలెన్స్ విభాగం దృష్టిసారించకపోవడంలో అంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**ఎస్ఇ, ఇఇల వివరణ:** కూకట్‌పల్లి జోన్ పరిధిలోని ఇఇలు, డీఇల కార్యాలయాల్లో అవినీతి, అక్రమాల గురించి వివరణ కోరగా వివిధ అభివృద్ధి పనులు సక్రమంగానే జరుగుతున్నట్లు, ఎస్ఇ శ్రీకాంతి, ఇఇలు గోవర్దన్, రాజేశ్వరిలు తెలిపారు. కాంట్రాక్టర్లు నాణత్య ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వివిధ అభివృద్ధి పనులకు సంబందించి కాంట్రాక్టర్లకు సంబంధించిన బిల్లులను ఫైళ్ళను సకాలంలోనే క్లియర్ చేస్తున్నట్లు ఎస్ఇ శ్రీకాంతి, , ఇఇలు రాజేశ్వరి, గోవర్దన్‌లు తెలిపారు.

# విద్యుత్ ఉద్యోగుల ప్రజాబాట

వినియోగదారుల వద్దకే అధికారులు
మోస్ట్ ట్రిప్పింగ్ ఫీడర్లపై ప్రత్యేక దృష్టి
క్షేత్రస్థాయిలో తనిఖీలు..సమస్యలకు పరిష్కారం



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

**హైదరాబాద్,జులై 7,ప్రభాతవార్త:** వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) చేపట్టిన "ప్రజాబాట" కార్యక్రమం చేపట్టింది. ఈమేరకు మంగళవారం సంస్థ పరిధిలోని 21 సర్కిళ్లలో నిర్వహించింది. టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశాల మేరకు ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అధికారులు నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి విద్యుత్ వ్యవస్థను పరిశీలిస్తూ వినియోగదారులతో మమేకమవుతున్నారు.కార్యక్రమంలో భాగంగా తరచూ అంతరాయాలు ఏర్పడుతున్న ఫీడర్లను ప్రత్యేకంగా గుర్తించి, వాటిపై సమగ్ర తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఫీడర్ల వెంట స్తంభం నుంచి స్తంభం వరకు పరిశీలనలు చేపట్టి, విద్యుత్ అంతరాయాలకు దారితీసే సమస్యలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకుంటున్నారు.అలాగే విద్యుత్ లైన్లకు అడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించేందుకు ప్రత్యేక ట్రీ ట్రిమ్మింగ్ కార్యక్రమం చేపట్టారు. ఇందుకోసం ఆధునిక బ్యాటరీ ఆధారిత ట్రీ కట్టింగ్ యంత్రాలు, భద్రతా జాకెట్లను అన్ని సెక్షన్ల లైన్ ఇన్‌స్పెక్టర్లకు అందజేశారు. దీంతో వర్షాకాలంలో చెట్ల కొమ్మల వల్ల ఏర్పడే విద్యుత్ అంతరాయాలు తగ్గడంతో పాటు ఉద్యోగుల భద్రత కూడా మెరుగుపడనుంది. ప్రజాబాట కార్యక్ర మం ద్వారా అధికారులు నేరుగా వినియోగదారుల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకోవడంతో పాటు విద్యుత్ నెట్‌వర్క్ బలోపేతం, నిర్వహణ పనుల పర్యవే క్షణ, ఫీడర్ పనితీరు మెరుగుదల, చెట్ల కొమ్మల తొలగింపు, భద్రతా ప్రమాణాల అమలు వంటి అంశా లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. విద్యుత్ అంతరాయాలను తగ్గించడం, వినియోగదారుల సంతృప్తిని పెంచడం,నాణ్యమైన విద్యుత్ సేవలను అందించడం లక్ష్యంగా ప్రజాబాట కార్యక్రమం ప్రతి వారం కొనసాగుతుందని టీజీఎస్పీడీసీఎల్ యాజమాన్యం తెలిపింది.

# సర్టిఫికెట్ లేకుండా డాక్టర్ అవతారం

**ఎల్.బి.నగర్, జులై 7 ప్రభాతవార్త:** అనుమతులు లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్న ఆర్ఎంపీపై కేసు నమోదు అయింది. అతని వద్ద నుంచి వైద్య పరికరాలు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేశారు. వైద్యునికి కావలసిన ఎలాంటి సర్టిఫికెట్ లేకుండా డాక్టర్ అవతారం ఎత్తాడు. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్‌జానీ తెలిపిన వివరాల ప్రకారం... నాగోల్ డివిజన్ అజయ్‌నగర్‌లో ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు లేకుండా క్లినిక్ నిర్వహిస్తూ ప్రజలకు వైద్య చేస్తున్న సాయి సాత్విక్ క్లినిక్‌పై మంగళవారం పోలీసులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. క్లినిక్ నిర్వహిస్తున్న అకుల కిషోర్‌కుమార్(44)ను విచారించగా క్లినిక్ నిర్వహించేందుకు అవసరమైన ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు అతని వద్ద లేవు. అనుమతి లేకుండానే చట్ట వ్యతిరేకంగా ప్రజలకు వైద్య చికిత్స అందిస్తూ వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీల్లో క్లినిక్ నుంచి స్టెతస్కోప్, బీపీ, చెకింగ్, మెషీన్, రెండు థర్మామీటర్లు, 40 సిరంజీలు, ప్రిస్క్రిప్షన్ బుక్, ఎనిమిది ఇంజెక్షన్లు, రెండు కత్తెరలు, ఐడీకార్డు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, స్వాధీనం చేసుకున్న వస్తువులతో పాటు నాగోల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రజల ప్రాణాలతో చెలగాట మాడే విధంగా ఎలాంటి అనుమతులు లేకుండా వైద్య సేవలు అందించే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# మెట్రోపై సమీక్షించిన అదనపు ఎండి అజిత్‌రెడ్డి

**హైదరాబాద్ జులై 7 ప్రభాతవార్త**

మెట్రో రైల్ (హెచ్ఎంఆర్ఎల్) అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి.అజిత్‌రెడ్డి మంగళవారం మెట్రో రైల్ నెట్‌వర్క్ ఆపరేషన్లు, నిర్వహణ, భద్రతా వ్యవస్థలను సమీక్షించేందుకు ఉప్పల్ మెట్రో డిపోను సందర్శించారు. ఈ పర్య టన సందర్భంగా ఆయన మెట్రో రైల్ ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ (ఓసిసి), కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)ల ను పరిశీలించారు. రియల్‌టైమ్ రైలు కార్యకలాపాలు, సిగ్నలింగ్ వ్యవస్థలు, భద్రతా ని ఘా, అత్యవసర ప్రతిస్పందన యంత్రాంగాలు, మొత్తం నెట్‌వర్క్ నిర్వహణపై అధికారు లు ఆయనకు వివరించారు. హెచ్ఎంఆర్ఎల్ అధికారులతో పాటు ఎల్అండ్‌టి మెట్రో ఎండి కె.వి.బి.రెడ్డి, ఇతర సీనియర్ ప్రతినిధులతో కూడిన ఎల్ అండ్ టి మెట్రో రైల్ హైదరాబాద్ (ఎల్అండ్‌టి ఎంఆర్‌హెచ్ఎల్) మరియు కియోలిస్ బృందంతో అదనపు ఎండీ అజిత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎల్ అండ్ టి ఎంఆర్‌హెచ్ఎల్, కియోలిస్ అధికారులు మెట్రో రైలు కార్యకలాపాలు, ప్రయాణీకుల సేవలు, నిర్వహణ వ్యవస్థలు, కార్యాచరణ నియంత్రణ, భద్రతా నియమావళి, డిపో సౌకర్యాలు, మెట్రో కార్యకలాపాల ఆర్థిక అంశాలను వివరిస్తూ హైదరాబాద్ మెట్రో రైలు కార్యకలాపాలపై సమగ్రమైన ప్రజెంటేషన్ ఇచ్చారు. అదనపు మేనేజింగ్ డైరెక్టర్ వివిధ కార్యాచరణ,నిర్వహణ అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ పర్యటనలో భాగంగా బి.అజిత్‌రెడ్డి రోలింగ్ స్టాక్, ఇతర కీలక మౌలిక సదుపాయాల కోసం అనుసరిస్తున్న నిర్వహణ పద్ధతులను తెలుసుకోడానికి మెయింటెనెన్స్ వర్క్‌షాప్, వీల్ లేత్ వర్క్‌షాప్ (వీల్ గ్యారేజ్)ను పరిశీలించారు. మెట్రో రైల్ నిర్వహణ నిపుణులు, అధికారులు అవలంబిస్తున్న నిర్వహణ ప్రమాణాలను, కార్యాచరణ సామర్థ్యాన్ని ఆయన అభినందించారు. ఈ పర్యటనలో హెచ్ఎంఆర్ఎల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ డి.వి.ఎస్.రాజు, చీఫ్ సిగ్నల్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ ఎస్.కె.దాస్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్, చీఫ్ ఇంజనీం సాయపరెడ్డి, జనరల్ మేనేజర్ (సెక్యూరిటీ) శ్రీనాథ్‌రెడ్డి తదితర హెచ్ఎంఆర్ఎల్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షి స్తున్న హెచ్ఎంఆర్ఎల్ అదనపు ఎండీ అజిత్‌రెడ్డి, చిత్రంలో ఎల్అండ్‌టి మెట్రో ఎండి కెవిబిరెడ్డి తదితరులు

## తెలంగాణ ప్రజాకళలో ఆదివాసీ జానపద వైభవం

**రవీంద్రభారతి, జులై 7 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల కళామందిరం) ఆరుబయలు కళావేదికలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి నేతృత్వంలో 101 రోజులపాటు నిర్విరామంగా జరుగుతున్న సాంస్కృతిక మహోత్సవం తెలంగాణ ప్రజాకళ 97వ రోజు గోండు భాషలో ఆదివాసీ జానపద కళారూపం వాఘె వేదిక కళాప్రదర్శనతో దద్దరిల్లింది. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మారుతి బందం అత్యంత అద్భుతంగా ప్రదర్శించిన వాఘె జానపద కళారూపం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిమళాన్ని గుభాళింపజేసింది. ఆదిలాబాదఖ గిరిజనుల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి ఆరాధనను ప్రతిబింబించే గోండు భాషా జానపద గీతాలు, డప్పు, డోలక్, బోండ్కా వంటి సంప్రదాయ వాయిద్యాల మేళవింపు వీనువిందు, నేత్రపర్వం కావించాయి. సంప్రదాయ వస్త్రదారణ, ప్రత్యేక ఆహార్యం, ఉత్సాహభరిత నృత్యవిన్యాసాలు ఆద్యంతం రక్తికట్టించి గిరిజన సంస్కృతికి పద్దంపట్టాయి. ప్రముఖంగా డప్పుపై విఠల్ అజిక్, బోండ్కాపై రాందాస్, డోలక్‌పై బండు గైక్వాడ్‌లు అద్భుత వాద్యసహకారంతో ప్రదర్శనకు మరింత శోభను చేకూర్చారు. విద్యానందచారి, శ్రీనివాస రాజులు వ్యాఖ్యానంతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన తెలంగాణ ప్రజాకళ సాంస్కృతిక మహోత్సవ సభాకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి విశిష్ట అతిథులు పి.నర్సింలు, డా. పి.విజయ్‌కుమార్, ముచ్చర్ల దినకర్, పల్లె నర్సింలు తదితరులతో కలిసి కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు.

# సనత్‌నగర్‌లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్

-ఐదుగురు గంజాయి విక్రేతల అరెస్ట్..
-35 ద్విచక్ర వాహనాలు సీజ్



కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీస్ సిబ్బంది

**సంజీవరెడ్డి నగర్, జులై7, ప్రభాతవార్త:**

హైదరాబాద్ నగరాన్ని డ్రగ్స్ రహిత నగరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జూబ్లీహిల్స్ జోన్ పోలీసులు సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పటాన్‌వాడి, ఫతేనగర్ ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భారీ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ (కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్) నిర్వహించారు. అక్రమ మద్యం విక్రయాలు, గంజాయి వినియోగం జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు జూబ్లీహిల్స్ జోన్ డీసీపీ ఎ. రమణారెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ఈ ఆపరేషన్‌లో ఒక అదనపు డీసీపీ, ఇద్దరు ఏసీపీలు, 10 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 20 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 150 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పోలీసులు 10 సెర్చ్ పార్టీలు, 10 కట్‌ఆఫ్ పార్టీలు, 5 లిఫ్టింగ్ పార్టీలు, ఒక హోల్డింగ్ పాయింట్ ఏర్పాటు చేసి ప్రాంతమంతా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.తనిఖీల సందర్భంగా రెండు బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించిన పోలీసులు అక్రమంగా విక్రయించేందుకు నిల్వ ఉంచిన 25 లీటర్ల ఐఎంఎఫ్ఎల్ మద్యం, మొత్తం 82 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారిపై కేసులు నమోదు చేశారు.గంజాయి వినియోగాన్ని అరికట్టే చర్యల్లో భాగంగా అనుమానాస్పదంగా ఉన్న సుమారు 15 మందిని అదుపులోకి తీసుకుని హెచ్‌న్యూ ప్రత్యేక బృందం ద్వారా పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో గంజాయి సేవించినట్లు తేలిన ఐదుగురిని అరెస్ట్ చేసి, ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.అలాగే సరైన పత్రాలు లేకుండా సంచరిస్తున్న 35 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. మరో ఐదు త్రీ వీలర్లను వెరిఫికేషన్ నిమిత్తం స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు.ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నగరంలో డ్రగ్స్, అక్రమ మద్యం, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జూబ్లీహిల్స్ జోన్ పోలీసులు తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ ఎ. రమణారెడ్డి స్పష్టం చేశారు.

## సాధనతోనే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు

### టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్



పురస్కారాలు స్వీకరించిన విద్యార్థులతో నైనా జైస్వాల్, వినయ్ భూషన్ గణపతి, అరుణ శ్రీ తదితరులు

**జూబ్లీహిల్స్, జులై 7, ప్రభాతవార్త:** సాధనతోనే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని భారత టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి, బాల మేధావి నైనా జైస్వాల్ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ (విద్యాశ్రమ్)లో ప్రతిభ గల విద్యార్థులకు మంగళవారం బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నైనా జైస్వాల్‌తోపాటు మాజీ బ్యాంకర్ వినయ్ భూషణ్ భగవతి అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నైనా జైస్వాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుందని, పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని నిరంతర సాధనతో పాటు గురువుల పట్ల గౌరవం కలిగి ఉంటే విజయం సాధించవచ్చన్నారు. తప్పులను గుర్తించి సరిదిద్దుకోవడమే విజయానికి తొలి మెట్టు అని, ఎప్పుడూ నిరాశ చెందకుండా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. వినయ్ భూషణ్ భగవతి మాట్లాడుతూ విద్యార్థులు గౌరవం, బాధ్యత, తార్కిక ఆలోచన, పఠన అలవాటు వంటి విలువలను పెంపొందించుకోవాలని, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి. అరుణశ్రీ విద్యార్థులను అభినందిస్తూ కృషి, అంకితభావం, పట్టుదలతో ఉన్నత విజయాలు సాధించాలని, అదే సమయంలో కరుణ, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవరుచుకుని ప్రపంచ పౌరులుగా ఎదగాలని సూచించారు. సీనియర్ సెకండరీ టాపర్లను సన్మానించడంతో పాటు వివిధ తరగతుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రావీణ్య పురస్కారాలు అందజేశారు.

## బిఎడ్ అర్హత పరీక్ష నోటిఫికేషన్ విడుదల

**జూబ్లీహిల్స్, జులై 7, ప్రభాతవార్త:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బీఎడ్ (ఓడిఎల్) అర్హత పరీక్ష–2026–27 నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి జులై 24 చివరి తేది అని విశ్వవిద్యాలయ అధికారులు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు విశ్వవిద్యాలయ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ రుసుం రూ., 1000 అని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు రూ. 750 చెల్లించాలన్నారు. రుసుంను ఆన్‌లైన్‌లో డెబిట్ లేదా క్రెడిట్ కార్డు ద్వారా టీఎస్ ఆన్‌లైన్ ఫ్రాంఛైజీ కేంద్రాల్లో చెల్లించాలన్నారు. ఆగస్టు 2వ తేదిన తెలంగాణాలోని పరీక్షా కేంద్రాల్లో ఈ అర్హత పరీక్ష ఉంటుందన్నారు. ఇతర వివరాలకు వర్సిటీ సహాయ కేంద్రం నంబర్లు 040–23680333/555 లో సంప్రదించాలని సూచించారు.

## మంచినీటి పైప్‌లైన్‌లో మురుగు నీరు సరఫరా



జనప్రియానగర్‌లో నిరసన తెలుపుతున్న బస్తీ మహిళలు.

**యూసుఫ్‌గూడ, 7 జులై, ప్రభాతవార్త :** అసలు త్రాగేందుకు నీరు దొరకడం లేదు.. వచ్చే కొద్దిపాటి నీరు కూడా కలుషిత నీరు సరఫరా కావడంతో స్థానికంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాయిత్రినగర్ డివిజన్ పరిధిలోని రోడ్ నంబర్ 10 జనప్రియానగర్, పర్వత్‌నగర్ ప్రాంతంలో గత మూడు రోజులుగా మంచి నీటి పైప్‌లైన్లలో డ్రైనేజి నీరు కలిసి సరఫరా అవుతుండటంతో కనీసం వాడుకునేందుకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బస్తీ మహిళలు వాపోతున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నప్పటికి నామమాత్రంగా చూసి వెళ్తున్నారే కాని తమకు మురుగు సమస్యను శాశ్వత పరిష్కారం చేయటం లేదని తెలిపారు. ప్రభుత్వం నుంచి కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా నీటి సరఫరా చేయాలని మురుగు నీరు సరఫరా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

## శంభీపూర్ రాజును పరామర్శించిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు



శంభీపూర్ రాజుతో మాట్లాడుతున్న నేతలు

**దుండిగల్, జులై 7, ప్రభాతవార్త** మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇటీవల వరంగల్ జిల్లాలోని కన్నెపల్లి రిజర్వాయర్ పర్యటనకు వెళ్తున్న సమయంలో మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన శంభీపూర్‌లోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శాసన మండలి ప్రతిపక్ష నేత ఎమ్మెల్సీ మధుసూదన చారి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, తక్కళ్లపల్లి రవీందర్ రావు శంభీపూర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు త్వరగా పూర్తిగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని వారు ఆకాంక్షి ంచారు. పార్టీ కార్యకలాపాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన సేవలు మరింత కొనసాగాలని అభిలషిస్తూ ధైర్యం చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఈ పరామర్శ కార్యక్రమంలో పాల్గొని శంభీపూర్ రాజు త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షి ంచారు.

## నేడు విద్యుత్ లేని ప్రాంతాలు...

**బేగంబజార్, జులై 7 ప్రభాతవార్త:** బేగంబజార్ సిబిడి పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా సోమవారం 11 కెవి విద్యుత్ ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ డివిజనల్‌ఇంజనీర్ అన్నయ్య తెలిపారు. 11 కె.వి.గౌలిగూడ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా ఉదయం 9గంటల 30నిమిషాల నుంచి మధ్యాహ్నం 12గంటల 30 నిమిషాల వరకు అశోక్‌బజార్, నేషనల్‌హోటల్, తారాహోటల్‌లైన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. 11 కెవి ఉస్మాన్ గంజ్ విద్యుత్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్, ఉస్మానియా ఆసుపత్రిలైన్, గోల్‌మజీద్‌లైన్ తదితరప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. 11 కెవి ఫీల్‌ఖానా ఫీడర్ మరమ్మత్తుల కారణంగా మధ్యాహ్నం 2గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5గంటల 30 నిమిషాల వరకు అజీజ్‌ప్లాజా, రంగ చారిలైన్, ప్రేమ్‌ప్లాజా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ డివిజనల్ ఇంజనీర్ అన్నయ్య తెలిపారు.

## డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి : ట్రాఫిక్ ఎసిపి లక్ష్మణ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్

**ముషీరాబాద్, జులై 7, ప్రభాతవార్త:** డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ ఎప్పుడూ చేయకూడదని ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్ అన్నారు. మంగళవారం దోమలగూడలోని ద్వారకా హైస్కూల్ ఫౌండేషన్ డే సందర్భంగా విద్యార్థులకు మరియు సిబ్బందికి ట్రాఫిక్ నియమాలు, రహదారి భద్రతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. బేగంపేట టిటిఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ మరియు వారి సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంకు ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ డిఫెన్సివ్ డ్రైవింగ్ అనేది ఒక చురుకైన, సురక్షితమైన డ్రైవింగ్ వ్యూహమని, ఇది ప్రమాదాలను ముందుగానే గమనించి, అప్రమత్తంగా ఉండటం ద్వారా ప్రమాదాలను నిరోధించటానికి ఉపయోగపడుతుందని అన్నారు. టిటిఐ ఇన్స్పెక్టర్ నాగుల అశోక్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. రహదారి భద్రతకు సంబంధించి సీట్ బెల్టులు, హెల్మెట్లు ధరించటం, వేగ పరిమితులు పాటించటం, మద్యం సేవించి వాహనం నడపటం వల్ల జరిగే అనర్థాలు, డ్రైవింగ్ సమయంలో మొబైల్ వాడకం వల్ల జరిగే ప్రమాదాలు, ఇండికేటర్లను ఎలా ఉపయోగించాలి తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. గోల్డెన్ అవర్‌లో రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసిన వారికి భారత ప్రభుత్వం రహ్‌వీర్ పథకం ద్వారా 25వేల నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్‌ను అందచేస్తుందని తెలిపారు. విద్యార్థులు పరిమితికి లోబడి ఉండే వాహనాలలో మాత్రమే ప్రయాణం చేయాలని సూచించారు. అనంతరం స్కూల్ విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్స్‌పాల్ జే.సరితరావు, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏడాదిన్నర కాలం కావస్తున్నా పట్టించుకోని జాంబాగ్ రోడ్లు..



అధ్వాన్నంగా మారిన జాంబాగ్ రహదారులు...

**అఫ్జల్‌గంజ్, జులై7 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అటు పాలకులు, ఇటు అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని జాంబాగ్ డివిజన్ ప్రజలు వాపోతున్నారు. జాంబాగ్ డివిజన్ పరిధిలోని పుత్లీబౌలి సమీపంలోని స్వాతి దాబా రహదారిలో పైపులైన్ల కోసం తవ్వి ఏడాద్నిర కావస్తున్నప్పటికిపట్టించుకోక పోవడంతో ప్రజలు తమ రాకపోకలను సాగించాలంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు వాపోతున్నారు. డివిజన్ పరిధిలోని స్వాతి దాబా రహదారి నుంచి ఎంజె మార్కెట్ వెళ్లేందుకు ప్రజలు, వాహనదారులు తమ రాకపోకలను సాగిస్తుంటారు. ఏడాదిన్నర నుంచి పైపులైన్ల కోసం తవ్విన రోడ్డుపూర్తిగా గుంతలమయంగా మారి అధ్వాన్నంగా మారిందన్నారు. పైపులైన్ నిర్మాణ పనులు పూర్తిఅయిన వెంటనే రోడ్డును సమాతరంగా చేసి రహదారిపై సిసి రోడ్డులేదా. బిటి రోడ్డు వేయాల్సి నజాంబాగ్ డివిజన్ అసిస్టెంట్ ఇంజనీర్‌తోపాటు డిప్యూటి ఇంజనీర్, ఈఈలు దృష్టిసారించడంలేదన్నారు. చేసిన పనులకు కాంట్రాక్టర్లకు నిధులు ఇవ్వలేకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడంలేదని ఇంజనీరింగ్‌అధికారులు వాపోతున్నారు. వారిపై ఎలాంటి వత్తిడి తీసుకురాలేక పోతున్నామన్నారు. దీనికి తోడు స్థానికదుకాణాదారులు, ప్రజలు ఇటివల గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్ కుమార్‌గౌడ్ దృష్టికి జాంబాగ్ డివిజన్‌లోని రహదారుల విషయమై తీసుకువెళ్లారు. దీంతో ఆనంద్‌కుమార్‌గౌడ్ స్థానిక ప్రజలు, దుకాణాదారులతో కలిసి అబిడ్స్‌లోని గోల్కొండ జోనల్ కమీషనర్ ఉదయ్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పిచారు. రహదారి ఘోరంగా మారిందని వివరించారు. వెంటనే జోనల్ కమీషనర్‌ఉదయ్‌కుమార్ ఇంజనీరింగ్ విభాగానికి వీలైనంత తొందరగా సిసి రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. రాబోయే బోనాల పండుగ లోపు ఆప్రాంతంలో సిసి రోడ్డు పనులు పూర్తి చేయాలని లేని పక్షంలో జిహెచ్ఎంసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

## వివోఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు, మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

### -మంత్రి సీతక్కను కలిసిన మొగుళ్ళ రాజిరెడ్డి



కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న మొగుళ్ళ రాజిరెడ్డి తదితరులు

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త** గ్రామాల్లో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న వివోఏ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర మంత్రి సీతక్కకు రాష్ట్ర వివోఏ, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.డి.చంద్రశేఖర్, వై.నాగన్నగౌడ్ తదితర యూనియన్ నేతలతో కలిసి ఆయన మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఐకేపి వివోఏ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు, మిషన్ భగీరథ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, సమాన పనికి సమాన వేతనంగా నెలకు రూ.26 వేలు, ఉద్యోగ భద్రత, భీమా, తదితర సౌకర్యాలు అందజేయాలని ఈ సందర్భంగా మొగుళ్ళ రాజిరెడ్డి మంత్రి సీతక్కను కోరారు. కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మానిఫెస్టోలో పేర్కొన్నట్లుగా వారికి పే స్కేల్ వర్తింపజేసి, వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ఆయన గుర్తు చేసారు. గత ప్రభుత్వం తొలిగించిన 265 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, వివోఏ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మిషన్ భగీరథ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబానికి 15 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని అలాగే ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.400 చొప్పున పెంచి, వారికీ సంవత్సరంలో 150 రోజుల పని కల్పించాలని రాజిరెడ్డి విన్నవించారు. మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన జల మండలి గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఘన విజయం సాధించిన మొగుళ్ళ రాజిరెడ్డి మంత్రి సీతక్క శాలువా, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ దివ్య దేవరాజన్, యూనియన్ నేతలు తలరి రాములు, బొల్లుగి రవి, కంకాల సిద్దిరాజు, చల్లా వెంకటేశ్వర్లు, గోల్కొండ సురేష్, శంకర్ బబ్బురి, ఉపేందర్, వేల్పుల మల్లన్న, శ్రీను, ఇండ్ల రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఔషధ శాస్త్రాచార్యులు పద్యమహాకావ్యం రచించడం విశేషం : డా. కె.వి.రమణాచారి



భరతోదయము పద్యమహాకావ్యం గోడపత్రికను ఆవిష్కరిస్తున్న డా. కె.వి.రమణాచారి, రాంభావు, ఫణీంద్ర, విజయకుమార్

**నాంపల్లి, జులై 7 ప్రభాతవార్త :** గొప్ప ఔషధశాస్త్ర ఆచార్యులైన డా. దేవరాజు రాంభావు విద్యార్థి దశలో గురువు మహాకవి వానమామలై వరదాచార్య కలిగించిన ప్రేరణ, తెలుగు సాహిత్యం జిజ్ఞాశ, ఆశీర్వచనంతో 770 పేజీ బృహత్ పద్య మహాకావ్యాన్ని రచించడం విశేషమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. మంగళవారం ఉదయం రెడ్‌హిల్స్‌లోని రమణాచారి క్యాంపు కార్యాలయంలో డా. దేవరాజు రాంబావు రచించిన భరతోదయము పద్యమహాకావ్యం గ్రంథ ఆవిష్కరణ గోపప్రతిని ముఖ్యఅతిథిగా హాజరైన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు ఫణీంద్ర, రచయిత దేవరాజు రాంభావు, ఆచార్య వంగపల్లి విశ్వనాథం, మాధవరెడ్డి, సూర్యనారాయణ మూర్తి, వేమరాజు విజయకుమార్, డా. నందూరి విద్యారణ్యస్వామి, డా. కుసుమకుమారి తదితరులతో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు. నవ్యసాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఈ గ్రంథం డా. దేవరాజు రాంబావు అశీతి (80వ) జన్మదిన సందర్భంగా ఈ నెల 12న శ్రీసత్యసాయి నిగమాగమంలో ప్రముఖుల చేతులమీదుగా ఆవిష్కరింపజేయడం సంస్థ అదృష్టమేనన్నారు. అనంతరం విశిష్ట అతిథులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాంభావు శిష్యులు, మిత్రులు, కుటుంబసభ్యులు, సాహిత్యాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## భీమా మైదాన్‌లో నివసిస్తున్న బాధితులకు ప్రత్యామ్నాయ వసతి కల్పించాలి

### - జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు కాంగ్రెస్ నేతల వినతి

**చిక్కడపల్లి జులై 7 ( ప్రభాతవార్త ) :** గాంధీనగర్ డివిజన్ పరిధిలోని భీమా మైదాన్ ప్రాంతంలో పేదలు నివసిస్తున్న ఇళ్లను మరమ్మతుల పేరుతో ఖాళీ చేయాలంటూ జీహెచ్ఎంసీ అధికారులు ఇంజంక్షన్ ఆర్డర్ (నోటీసులు) జారీ చేయడంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఈ ప్రాంతంలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించడానికి వచ్చిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్ స్థానిక డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బింగి సాయికీర్త్ తో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. భీమా మైదాన్‌లో పేదలు నివసిస్తున్న ఇళ్ల నిర్మాణాలు పటిష్టంగానే ఉన్నప్పటికీ, ఎలాంటి ముందస్తు ప్రత్యామ్నాయం చూపకుండా ఖాళీ చేయమనడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బింగి సాయి కీర్త్ (బాబ్జీ) నాయకత్వంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ పుష్ప లత ని కలిసి వినతిపత్రం సమర్పించారు. బాధిత కుటుంబాల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, అదే ప్రాంగణంలో వారికి పునరావాసం కల్పించి, తిరిగి ఇళ్లను కేటాయించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో బాధితులు పాల్గొన్నారు.

## కేంద్ర సంగీత నాటక అకాడమీలో దక్షిణాదికి దక్కని ప్రాధాన్యం : ఎల్లా వెంకటేశ్వరరావు



కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న ప్రఖ్యాత మృదంగ విద్యాంసుడు ఎల్లా వెంకటేశ్వరరావు

**చిక్కడపల్లి, జులై 7 ,ప్రభాతవార్త :** కేంద్ర సంగీత నాటక అకాడమీలో ఉత్తర భారతదేశం వారి ప్రాబల్యం ఎక్కువగా సాగుతోందని, దక్షిణాది రాష్ట్రాలకు, ప్రత్యేకించి తెలుగువారికి తగిన ప్రాధాన్యత దక్కడం లేదని ప్రఖ్యాత మృదంగ విద్యాంసుడు ఎల్లా వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో విఖ్యాత సంగీత నిధి, పద్మవిభూషణ్ డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ 96వ జయంతిని పురస్కరించుకుని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు విజేతలకు ఘన సత్కార కార్యక్రమం కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డాక్టర్ పి. భారతి అధ్యక్షతన మంగళంపల్లి సత్యనారాయణ ఫౌండేషన్, పెండ్యాల నృత్య భారతి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ కల్చర్ సంయుక్త నిర్వహణలో, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎల్లా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంగీత ఆకాశంలో బాలమురళీకృష్ణ ఒక ధృవతార అని కొనియాడారు. త్యాగరాజస్వామి, అన్నమయ్యల వంటి వాగ్గేయకారుల కోవకు చెందిన మహనీయులని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ కేంద్ర సంగీత నాటక అకాడమీలో ఉత్తరాది వారి ఆధిపత్యం గురించి వివరించారు. ఈ సభకు ప్రొఫెసర్ సుదర్శన్ సింగ్ స్వాగతం పలుకగా అవార్డులకు ఎంపికైన ప్రముఖులను నిర్వాహకులు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. గుమ్మడి గోపాలకృష్ణ (నాటకం), పి.ఆర్. శర్మ (కూచిపూడి), రాజేశ్వరీ సాయినాథ్ (భరతనాట్యం) , కె. శేషాద్రి (సంగీతం) , ఓలేటి రంగమణి (నాట్యం) , సూర్యనారాయణ (గానం) , డి. శ్రీనివాస్ (వాయులీనం) , చిదంబర్ రావు (తోలు బొమ్మలాట) , రామయ్య (జానపదం) , వీరితో పాటు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార విజేతలను కూడా ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రసజ్ఞులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాలల భవిష్యత్తును విధ్వంసం చేసే వర్గీకరణ చట్టాన్ని రద్దు చేయాలి



**సైఫాబాద్, జులై 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలో లక్షలాది మంది మాలల భవిష్యత్తును విధ్వంసం చేసే ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని దోపిడీ మనువాద కుల పాలక పార్టీలు కుట్రలు చేసి రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ వారసులను విద్యా, ఉద్యోగ రంగాలలో రానీయకుండా అణిచివేస్తున్నాయని ఆయన ఆరోపించారు. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఆదేశాల మేరకు ఆర్ఎస్ఎస్ ఎంఆర్‌పిఎస్‌తో కుమ్మక్కైయిన సిఎం రేవంత్‌రెడ్డి మెజారిటి 26 మాల ఉపకులాలను తక్కువ జనాభాగా చూపించి గ్రూప్–సికి ఐదు మాత్రమే కేటాయించారని, ఉద్యోగ రోస్టర్ పాయింట్ కేటాయింపులో ఉన్న మాలలకు ఉన్న రిజర్వేషన్ అవకాశాలు రాకుండా అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. మాల సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీలో సిఎంకు ఇచ్చిన సహకారంతోనే ఎస్సీ వర్గీకరణ జరిగిందని, మాల ప్రజాప్రతినిధులు మాల జాతికి ద్రోహం చేశారని, మాలలను అడ్డుపెట్టుకుని మంత్రి పదవులు పొందారని ఆయన నిశితంగా విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చట్టాన్ని రద్దు చేయాలని, లేని పక్షంలో వచ్చే రానున్న స్థానిక, జనరల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొందపెడతామని వడ్లమూరి హెచ్చరించారు. ఇప్పటికే వర్గీకరణ చట్టాన్ని రద్దు చేయాలని హైకోర్టులో పలు రిట్ పిటిషన్ దాఖలు చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఆగస్టు నెలలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలను చేపడతామని ఆయన హెచ్చరించారు.

## తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు



పద్మావతినగర్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు.

**యూసుఫ్‌గూడ, 7 జులై, ప్రభాతవార్త :** పద్మావతినగర్‌లో ప్రజలకు తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా పైప్‌లైన్లు ఏర్పాటు చేసి నీటి సరఫరా అందివ్వడం జరుగుతుందని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం గాయిత్రినగర్ డివిజన్ పరిధిలోని పద్మావతి నగర్‌లో రూ.16 లక్షల వ్యయంతో చేపట్టిన నూతన తాగు నీటి పైప్‌లైన్ పనులకు మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్‌తో కలిపి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు సమస్యలు తెలుసుకుని అవసరమయ్యే విధంగా నిధులు కేటాయించి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా వంద కోట్లతో తాగు నీటి పరిష్కారానికి రిజర్వాయర్లు నిర్మించటం జరిగిందని కేసీఆర్ ప్రతి ఇంటికి ఉచితంగా నీరు అందిచారని అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు నీటి కష్టాలు మొదలయ్యాయి అన్నారు. కనీసం పండుగలకు కానుకలు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ ఉందన్నారు. సర్వే నంబర్ 18ని కాపాడేందుకు హైడ్రా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఏమాత్రం స్పందించటం లేదని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే సర్వే నంబర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు ఆదేశించారని తొందర్లో పనులు పూర్తవుతాయన్నారు. అదేవిధంగా స్థానిక బస్తీ వాసులతో మాట్లాడుతూ ఎస్ఐఆర్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని నిర్లక్ష్యం చేస్తే ఓట్లు తొలగించబడతాయని ఎస్ఐఆర్ విషయంలో ప్రజలు ఆందోళన చెందవద్దని అర్హత కలిగిన ప్రతిఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజ కవర్గం మైనారిటి సెల్ అధ్యక్షులు ఎమ్‌డీ గౌసుద్దీన్, పద్మావ తినగర్ బస్తీ అధ్యక్షులు జావేదుద్దీన్, డివిజన్ టీఆర్ఎస్ అధ్యక్షులు లింగాల అయలయ్య, జుబేర్, జాహేద్ షరీఫ్ పాల్గొన్నారు

## సర్ ప్రక్రియ అస్తవ్యస్తం..

## ఓటర్లలో గందరగోళం : బిక్షపతి యాదవ్

**నిజాంపేట్, జులై 7, ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం, భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమం బాచుపల్లి మండలంలో సమర్థవంతంగా అమలు కాకపోవడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నిజాంపేట, బండారి లేఔట్ అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ మంగళవారం ఆరోపించారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 24వ తేదీ వరకు ప్రతి అర్హత కలిగిన ఓటరికి బూత్ స్థాయి అధికారి ఇంటింటికి వెళ్లి గణన ఫారాలు అందజేసి, వాటిని తిరిగి సేకరించాల్సి ఉన్నప్పటికీ, ఇప్పటివరకు కేవలం 15 నుంచి 20 శాతం మంది ఓటర్లకే ఫారాలు అందినట్లు తెలిపారు. ఓటరు జాబితాలో చిరునామాల లోపాలు, అపార్ట్‌మెంట్లు అధికంగా ఉండడం, బూత్ స్థాయి అధికారులకు సరైన అవగాహన లేకపోవడం, కొందరు విధులకు హాజరు కాకపోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడం వల్ల కార్యక్రమం అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఓటరు వివరాల మార్పులు, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు వంటి అంశాల్లో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రధాన కూడళ్లలో అవగాహన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, ప్రచార వాహనాల ద్వారా ప్రజలకు సమాచారం అందించాలని, ఇంటింటికి వెళ్లే సిబ్బందితో గణన ఫారాల పంపిణీ కూడా చేపట్టాలని, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ప్రతినిధులు, స్వచ్ఛంద కార్యకర్తల సహకారంతో ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఈ అంశాన్ని భారత ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామని, ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

**సికింద్రాబాద్, జులై 7 ప్రభాతవార్త:** లైఫ్ లిఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన 200 మంది విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ ఫౌండర్ అండ్ ఛైర్మన్ చంద్రశేఖర్. జి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలతో పాటు పెన్సిల్ బాక్స్‌లు, పెన్నులు, దుస్తులు అందజేశారు. ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రేరణాత్మక సందేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లైఫ్ లిఫ్ట్ సొసైటీ జనరల్ సెక్రటరీ, అడ్వకేట్ గాజుల సంగీత ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్య ద్వారానే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ముఖ్య అతిథులుగా నటుడు అనిగిని రాజశేఖర్, అడ్వకేట్ సిద్ధార్థ పొంగుల, హీరోయిన్ మధులగ్నాదాస్, హెల్త్ అండ్ ఫిట్నెస్ మోటివేటర్ అను ప్రసాద్, హీరో హరిహరన్, కాళీ కుటుంబ శిష్యురాలు జానకి, క్రియా యోగి భార్గవ్ శర్మ, బిల్డర్ కుంచాల ఏడుకొండలు, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు లింగిశెట్టి హనుమంతరావు, ఎఫ్‌టీపీసీ మీడియా ఛైర్మన్ కిరణ్, వరల్డ్ స్విమ్మర్ విక్టోరియా, డీజే యాంకర్ నేహ, యాంకర్ శ్యామల, ప్లేబ్యాక్ సింగర్ ధనుంజయ్ తదితరులు. అలాగే శ్రీవారి సేవ సభ్యులు, లైఫ్ లిఫ్ట్ సొసైటీ సభ్యులు, చైతన్యశ్రీ, ఉదయ్ తేజ, గౌతమి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర కరాటే బూడోకాన్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ అధ్యక్షులుగా చంద్రశేఖర్ రెడ్డి



**అత్తాపూర్ జులై7 ,ప్రభాతవార్త :** తెలంగాణ కరాటే బూడోకాన్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా బి చంద్రశేఖర్ రెడ్డి నియమితులైనారు. రాజేంద్రనగర్ లో జరిగిన అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఛైర్మన్‌గా హైకోర్టు అడ్వకేట్ గా పనిచేస్తున్న వి పట్టాభి, వైస్ ఛైర్మన్ గా ఎం రాజ్ గోపాల్‌లను నియమించారు. ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్(వరంగల్, నైని సదానందం (హన్మకొండ), సయ్యద్ అబ్దుల్ ఖాధర్ హుస్సేనీ, మహ్మద్ సలీం జావీద్, ఎన్వి రెడ్డి, హరినాథ్, దినేశ్ (వరంగల్)లు నియమితులైనారు. ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ జహంగీర్, సంయుక్త కార్యదర్శులుగా మల్లేశ్, బి రవిందర్, ఆర్ దుర్గా ప్రసాద్, కోశాధికారి గా పూర్ణిమ రామమూర్తి లు నియమితులైనారు. కార్యవర్గ సభ్యులుగా జి యాదయ్య (నల్గొండ), పాశం దేవయ్య (జనగాం). శంకర్ (వరంగల్), శ్రీనివాస్ శెట్టి (వనపర్తి), బి ముఖేశ్ కుమార్ (హైదరాబాద్), బి వీర్ కుమార్ (నిజామాబాద్), ఖాధర్ (హైదరాబాద్)లు నియమితులైనారు.

## ఒక చోట తండ్రి.. మరోచోట తాత

**జూబ్లీహిల్స్, జులై 7, ప్రభాతవార్త:** ఒకరు కన్న కూతురితో అసభ్యంగా ప్రవర్తించగా, మరోచోట తాత తన మనువరాలితో అసభ్యంగా ప్రవర్తించారు. బోరబండ, మధురానగర్ ఠాణాల్లో చోటుచేసుకొన్న సంఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. బోరబండ ప్రాంతంల నివసించే ఒక వ్యక్తి తన కుమార్తె (19)తో గత కొద్ది కాలంగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. కుమార్తెపై మైనార్టీ తీరక ముందు, ఇటీవల వేసవి సెలవుల సమయంలోనూ అసభ్యంగా తాకి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. విషయాన్ని గుర్తించిన బాధితురాలి తల్లి, అత్త అతన్ని నిలదీయగా బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మధురానగర్ ఠాణా పరిధిలో మనువరాలితో అసభ్యంగా ప్రవర్తించిన తాతపై సైతం పోక్సో కింద కేసు నమోదైంది. జూన్ 25న బాధిత బాలిక ఇంటి బాత్రూంలో ఉండగా ఆమె తాత అసభ్య పదజాలంతో దూషిస్తూ, ఇల్లు ఖాళీ చేయకపోతే తనను, తన తల్లిదండ్రులను చంపేస్తానంటూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. అంతేకాకుండా, బాత్రూం మెట్ల వద్ద నిలబడి బాత్రూం వైపు మూత్ర విసర్జన చేశాడని, దీంతో భయాందోళనకు గురైన తాను వెంటనే ఇంట్లోకి పరుగెత్తి వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు తాతపై పోక్సో తోపాటు పలు సెక్షన్ల కింద మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్.. రెండు బైకులు స్వాధీనం

**కొంపల్లి, జులై 7, ప్రభాతవార్త** ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్థుడిని బాచుపల్లి పోలీసులు అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రెండు చోరీ చేసిన బైకులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినిపల్లి గ్రామానికి చెందిన లేట్ల ప్రవీణ్ ప్రస్తుతం ప్రగతి నగర్ రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్నాడు. గత కొంతకాలంగా ద్విచక్ర వాహనాలను చోరీ చేసి విక్రయిస్తూ వస్తున్నాడు. నిందితుడిపై గతంలో కూడా రెండు క్రిమినల్ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. తాజాగా రెండు ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన కేసులో నిందితుడిని బాచుపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

## జూబ్లీహిల్స్‌లో మెట్రో రైలింగ్‌ను ఢీకొట్టిన కారు

**జూబ్లీహిల్స్, జులై 7, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్‌లో కారు ఢీకొట్టడంతో మెట్రో రైలింగ్ దెబ్బతిన్న సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ మెట్రో స్టేషన్ వద్ద సి1600 నుంచి సి1601 స్తంభాల మధ్య ఉన్న రైలింగ్‌ను టీఎస్ 09 డీహెచ్ 5646 నంబర్ గల బీవైడీ అట్టో–3 కారు ఢీకొని దెబ్బతీసినట్లు గుర్తించారు. ఈ కారు చాణుక్య రెడ్డి పేరుపై నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌లో ప్రాజెక్ట్ ఇంజినీర్ (సివిల్)గా పనిచేస్తున్న కె. రితేష్ ఫిర్యాదు మేరకు ప్రజా ఆస్తుల ధ్వంసం నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తల్లిపై తనయుడి దాడి... కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జులై 7, ప్రభాతవార్త:** మద్యం మత్తులో తల్లిపై దాడి చేసిన కుమారుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గాయత్రీహిల్స్‌లోని దుర్గా టెంట్ హౌస్ ఎదురుగా నివసించే జీహెచ్ఎంసీ స్వీపర్ దుప్పాల లక్ష్మి కుమారుడు దుప్పాల వెంకటేష్ మద్యానికి బానిస కావడంతో గతంలో డీఅడిక్షన్ కేంద్రంలో చేర్పించింది. అయినప్పటికీ మద్యం సేవించడం కొనసాగిస్తున్నాడు. మద్యం తాగి ఇంటికి వచ్చి చేతిలో బీర్ బాటిల్‌తో ఉండగా తల్లి ప్రశ్నించడంతో అసభ్య పదజాలంతో తిట్టి, కర్రలు, కుర్చీతో దాడి ఆమెపై దాడి చేశాడు. గుట్కా నమిలి ఇంట్లోనే ఉమ్మివేస్తూ, తమపై కూడా ఉమ్ముతున్నాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిన ఆకతాయికి జైలు..

**బేగంపేట జులై 7,ప్రభాతవార్త :** బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఇన్స్‌పెక్టర్ సైదులు తెలియజేసారు. రసూల్‌పురా చౌరస్తా వద్ద ద్విచక్ర వాహనం పై వెళ్తున్న ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మహ్మద్ ఖాజా మేరాజుద్దీన్(35) అనే ఆకతాయికి న్యాయస్థానం ఐదు రోజుల శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఇన్స్‌పెక్టర్ తెలియజేసారు. రసూల్‌పురా గన్‌బజార్ కు చెందిన నిందితుడు శుక్రవారం మధ్యాహ్నం ఈ చర్యకు పాల్పడ్డాడు.. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం, ధూమపానం చేసినా, వాహనాలకు సంబంధించి సరియైన పత్రాలు లేకున్నా, హెల్మెట్ లేకుండా ప్రయాణించినా అలాంటి వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని ఇన్స్‌పెక్టర్ హెచ్చరించారు. ఈ కేసుల్లో దాదాపు పది మందికి న్యాయస్థానం జరిమానాతో పాటు సామాజిక సేవ చేయాలని శిక్ష ఖరారు చేసిందని తెలిపారు.

# చేపూరి శంకర్‌కు రక్తదాన అవార్డు



రక్తదాన అవార్డ్‌తో చేపూరి శంకర్.

**వనస్థలిపురం. జూలై. 7.ప్రభాతవార్త.**

ప్రముఖ సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో మంగళవారం గోరేటి వెంకన్న క్యాంప్ కార్యాలయంలో ప్రముఖ సామాజికవేత్త మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు చేపూరి శంకర్ ప్రత్యేకమైన అత్యుత్తమ రక్తదాన అవార్డు 2026 గవర్నర్ చేతుల మీదుగా అందుకున్న సందర్భంగా ఆకృతి ప్రత్యేక ఆత్మీయ సత్కారం నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకన్న మాట్లాడుతూ 30 పైగా రక్తదాన శిబిరాలు నిర్వహించి దాదాపు 1000 కి పైగా సభ్యులతో రక్తదానం చేయించడం చాలా గొప్ప విషయం అన్నారు తాను కూడా ప్రతి శిబిరంలో రక్తదానం చేసి 25 సార్లు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు ముఖ్యంగా యువత ముందుకు వచ్చి రక్త దాతలుగా మారాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు సిటీ కాలేజ్ ప్రొఫెసర్ తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ కోయి. కోటేశ్వరరావు మాట్లాడుతూ సమాజాన్ని రక్తదానానికి ప్రోత్సహించడంలో చేపూరి శంకర్ అంకితభావం పట్టుదల కార్యదీక్ష అమూల్యమైనదని ప్రశంసించారు సభకు ఆకృతి సుధాకర్ అధ్యక్షత వహించారు తనకు జరిగిన ప్రత్యేక సత్కారానికి చేపూరి శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఈశ్వరమ్మ యాదవ్‌కు ఘన సన్మానం



ఈశ్వరమ్మ యాదవ్‌ను సన్మానిస్తున్న జనప్రియ హోమ్స్ ప్రతినిధులు.

**వనస్థలిపురం జూలై. 7.ప్రభాతవార్త.**

తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం శ్రీ యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పాలకమండలి సభ్యురాలిగా నియమితులైన పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ ను వనస్థలిపురం జనప్రియ హోమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సంక్షేమ సంఘ భవనంలోఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చాలు అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా కాలనీ అభివృద్ధికి అందించిన సహాయ సహకారాలను కొనియాడారు. ప్రధాన కార్యదర్శి సురేంద్ర కులకర్ణి. కోశాధికారి వినయ్ కుమార్, ఉపాధ్యక్షులు దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శి నవీన్ కుమార్, బ్రహ్మాచారి, కమిటీ సభ్యులు వినోద్ దేశ్పాండే, సాంబశివరావు, సత్యనారాయణ . రాములు, ఆలయ కమిటీ చైర్మన్ పీవీ నరసింహారావు, వెంకట్రావు, కులకర్ణి శాంతశ్రీ. సరస్వతి. భవాని. తదితరులు ఉన్నారు

## దళితుల అభ్యున్నతిలో మందకృష్ణ కృషి ఎనలేనిది



జెండా ఎగురవేసిన రవీందర్

**హయత్ నగర్, జూలై 7 ప్రభాతవార్త :**

ప్రభుత్వాలపై అలుపెరుగని పోరాటం చేసి వర్గీకరణ సాధించిన మహా నాయకుడు మంద కృష్ణ మాదిగను యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని దళిత సంఘాల నాయకులు ఎర్ర రవీందర్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని హయత్ నగర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెండా ఎగురవేసి అయన కేకును కోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దళితుల అభ్యున్నతి కోసం మంద కృష్ణ నిరంతరం పోరాడు తున్నారని తెలిపారు. కార్యక్రమం లో పాల్గొన్న నాయకులు ఎత్తరి భీమ్ రాజ్, చింతపట్ల బాబురావు, ఎల్లమ్మ దేవాలయం కమిటీ అధ్యక్షులు క్యాదాస్ సతీష్, పారంద అరవింద్ స్వామి, బట్టీల కుమార్, క్యాదాస్ శీను, జొన్నగడ్డ ఆదాం పాల్గొన్నారు.

# జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించిన మాస్టర్ మైండ్స్ విద్యార్థులు

**మలక్ పేట, జూలై 7, ప్రభాతవార్త:**

ది ఇన్ స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) వారు ప్రకటించిన సీఏ ఫౌండేషన్ ఫలితాలలో జాతీయస్థాయిలో మాస్టర్ మైండ్స్ హైదరాబాద్ బ్రాంచ్ విద్యార్థులు 5,8వ ర్యాంకులు సాధించారాని హైదరాబాద్ బ్రాంచ్ అడ్మిన్ ప్రిన్సిపాల్స్ ఎస్. వెంకటేశ్వరరావు, ఎస్.ఎం. వలి బ్రాంచ్ అకాడమిక్ ప్రిన్సిపాల్స్ ఆంజనేయ రెడ్డి, అశోకులు పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు ఎం. సహిష్ణు జాతీయస్థాయిలో 5వ ర్యాంకు, ఎల్. ఆకాష్ 8వ ర్యాంకు లు సాధించాలని వివరించారు. అదేవిధంగా సిఏ ఫౌండేషన్ పరీక్ష ఫలితాలలో తమ విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థ యొక్క అకాడమిక్ ప్రణాళిక, క్రమశిక్షణ మూలంగానే విద్యార్థులు కామర్స్ కోర్సులలో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడానికి ఎంతగానో దోహదపడ్డాయని వివరించారు. జాతీయ స్థాయిలో 5, 8 ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఎం. సహిష్ణు, ఎల్. ఆకాష్ లను వారు అభినందించారు.

## ఎల్బీనగర్ వికలాంగుల విభాగం ఇన్‌చార్జిగా రామచంద్రయ్య



రామచంద్రయ్యకు నియామక ఉత్తర్వులను అందజేస్తున్న కాచం సత్యనారాయణ తదితరులు

**మలక్ పేట, జూలై 7, ప్రభాతవార్త:**

తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎల్బీనగర్ వికలాంగుల విభాగం ఇన్చార్జిగా బి. రామచంద్రయ్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు కాచం సత్యనారాయణ నియామక ఉత్తర్వులను అందజేసారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ దివ్యాంగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఎల్బీనగర్ వికలాంగుల విభాగం ఇన్చార్జిగా తనను నియమించినందుకు కాచం సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలియజేశారు

# ప్రభుత్వ భూములను కాపాడేందుకు కమ్యూనిస్టుల పాత్ర కీలకం

**-సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య**

**తుర్కయంజాల్ జూలై 7,ప్రభాతవార్త**



ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్, తొర్రూరు డివిజన్ల పరిధిలో ప్రభుత్వ భూములను కబ్జా చేయడంలో భూ కబ్జాదారులు రెచ్చిపోతున్నారని, వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య అన్నారు. మంగళవారం జిల్లా కార్యవర్గ సభ్యులు పి శివకుమార్ గౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేస్తుంటే చూస్తూ ఊరుకోమని, ఎర్రజెండా ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు డబుల్ బెడ్ రూములు కట్టించేంతవరకు పోరాడుతామని అన్నారు. తుర్కయంజల్ రెవిన్యూ సర్వేనెంబర్ 323 లో 45 ఎకరాలు 29 గుంటలు ప్రభుత్వ భూమి ఉందని, అదేవిధంగా మన్నెగూడ రెవిన్యూ సర్వేనెంబర్ 41ల లో పదుల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని అన్నారు. ఈ భూములలో అధికార పార్టీకి చెందిన నాయకుడు ఒకరు ఎకరాలలో కబ్జా పెడుతున్నారని తమ కబ్జాలు ఎక్కడ బయటకు వస్తాయని ఆందోళన చెందుతున్నారని అన్నారు. వీటన్నిటిని బయటికి తీసేంతవరకు కమ్యూనిస్టు పార్టీ పోరాటం చేస్తుందని, ఆ భూములు పేదలకు దక్కాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వ భూములకి సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేసి ఫెన్సింగ్ వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందుకోసం సిపిఐ పార్టీ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందని అన్నారు. తుర్కయంజాల్ రెవిన్యూ పరిధి సర్వే నెంబర్ 52, 212, 206 లలో కూడా ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 212లో స్మశాన వాటికను కూడా కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రతి పేదవాడికి ఇల్లు ఇంటి జాగా వచ్చేంతవరకు పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకురాలు అనురాధ, శివ ప్రసాదులు, మహిళా సంఘం కార్యదర్శి రోజా, పద్మ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# 17 నుంచి శ్రీరేణుకాదేవి, విజయదుర్గాదేవి పుష్కర బ్రహ్మోత్సవాలు

**ఎల్.బి.నగర్, జులై 7 ప్రభాతవార్త:**



అమ్మవారి దేవాలయం(ఇన్‌సెట్‌లో) రేణుక ఎల్లమ్మ విజయదుర్గ

శ్రీరేణుకాదేవి (ఎల్లమ్మ), శ్రీవిజయ దుర్గాదేవి సమేత అమ్మవార్ల పుష్కర బ్రహ్మోత్సవాలు ఈనెల 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు శ్రీదేవి ఉపాసకురాలు, గురుమాత సోమ వెంకటమ్మ తెలిపారు. కొత్తపేట న్యూమారుతినగర్ రోడ్‌నెంబర్ 5లోని శ్రీరేణుక ఎల్లమ్మ, శ్రీవిజయ దుర్గాదేవి అమ్మవార్ల పుష్కర బ్రహ్మోత్సవాలకు సంబంధించి భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లను చేస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా మొదటి రోజైన 17వ తేదీన గణపతిపూజ, శ్రీరమాసమేత శ్రీసత్యనారాయణస్వామి వ్రతము, ఉపాంగిరస మంత్రమాల పారాయణాలు, శ్రీరేణుక శాడవరణ మహాపూజ, శ్రీదేవి సప్తశతిపూజ, శ్రీప్రత్యంగిరా, ఏకవీర, నవదుర్గ పూజలు, 18వ తేదీన శ్రీరేణుక కవచ హృదయ ఖడ్గమాల, మంత్రమాల పారాయణాలు, శ్రీరుద్ర ఆహ్వానము, 19వ తేదీన స్థాపిత దేవతార్చన శ్రీనవదుర్గ, మహావిద్య, శ్రీసప్తశతి నవచండి మహాయాగము, 20వ తేదీన మూలమంత్ర ఆహ్వానంలో మహా పూర్ణాహుతి, మహాకుంభాభిషేకము, గంగతెప్ప, వాల్మీకపూజ, 21వ తేదీన శ్రీరేణుకాదేవి సమేత శ్రీవిజయదుర్గ అమ్మవార్లకు శతౌశదీయుక్త మహా బలాభిషేకము, అలంకారము, కొట్టినము బియ్యము, సొంతించుట, జిగువిత్తుట, శ్రీరేణుకాదేవి జమదాగ్ని మహర్షుల దివ్యకళ్యాణ మహోత్సవము, నాగవల్లి, ఇద్దరమ్మాలకు పెద్దపట్నాలు, విశ్వరూప సందర్శనము, సప్తఘటిక బోనం సమర్పణ, 22వ తేదీన అమ్మవార్లకు సారే, అమ్మవార్ల పల్లకి సేవ తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉత్సవాలలో భాగంగా కోదూరి దేవుని సత్యనారాయణ పర్యవేక్షణలో ఒగ్గుకథ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆరు రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాల వేడుకలలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మ వారి కృపకు పాత్రులు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్యే మర్రి కృషితో గౌతమ్ నగర్ ప్రజల దశాబ్దాల కల సాకారం

**మల్కాజిగిరి జూలై 7,ప్రభాతవార్త :**



మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కృషి ఫలితంగా గౌతమ్ నగర్ ఆర్ యు బి ప్రాజెక్టుకు ఆమోదం లభించిందని, ఇది నియోజకవర్గ అభివృద్ధిలో మరో మైలురాయిగా నిలుస్తుందని, గౌతమ్ నగర్ మాజీ కార్పొరేటర్ సునీత రాము యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని వారి కార్యాలయంలో మంగళవారం గౌతమ్ నగర్ మాజీ కార్పొరేటర్ సునీత రామ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మల్కాజిగిరి, గౌతమ్ నగర్ ప్రజల దశాబ్దాల కల సాకారం కానుంది. మల్కాజిగిరి,నియోజకవర్గం ఎల్ సి నెంబర్ 255 రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం రూ.33.61 కోట్లతో రోడ్ అండర్ బ్రిడ్జికి నిర్మాణానికి కీలక అడుగు వేసింది. రైల్వే గేట్ మూసివేత సమయంలో గౌతమ్ నగర్, ఆల్వాల్, సఫీల్‌గూడ, నేరేడ్ మెట్ తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు...రోజువారీ ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు... అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆర్ యు బి నిర్మాణం పూర్తయిన అనంతరం ఈ సమస్యలన్నీ తీరనున్నాయి. రైల్వే గేట్ పై ఆధారపడాల్సిన అవసరం లేకుండా వాహనాలు నిరాటంకంగా రాకపోకలు సాగించవచ్చునని, ఈ సమస్య పరిష్కారానికి కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి, మాజీ కార్పొరేటర్ శ్రీమతి సునీత యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాము యాదవ, నూర్,బీఆర్ఎస్ నాయకులు,బైరు అనీల్ కుమార్,మర్రి శ్రీనివాస్, కావలి శ్రీనివాస్,కిషన్,సూర్య ప్రకాష్,ఎస్వీఆర్ వెంకట్, భాను,వాసుదేవరావు,దత్తు,హబీబ్ ,రాజా,మల్లేష్,శ్రీనివాస్ కపూర్,గణేశ్ నాయక్,లక్ష్మణ్ యాదవ్,అశోక్, ప్రదీప్, కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రేటర్‌లో విలీనమైన కాలనీల అభివృద్ధికి రేవంత్‌రెడ్డి సర్కార్ కట్టుబడి ఉంది : కెఎల్ఆర్



నవారు మల్లారెడ్డి ఆధ్వర్యంలో కెఎల్ఆర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న అల్మాస్‌గూడ కాలనీల సంక్షేమ సంఘం నాయకులు

**సరూర్‌నగర్, జూలై 7 ప్రభాతవార్త:** పునర్వ్యవస్థీకరించిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన ప్రాంతాల అభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్‌కు సంబంధించిన అల్మాస్‌గూడ కాలనీల్లో సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులకు అవసరమయ్యే నిధులు మంజూరు చేయించాలని కోరుతూ మంగళవారం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి ఆధ్వర్యంలో వివిధ కాలనీల సంక్షేమ సంఘం నాయకులు కెఎల్ఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కెఆర్ఆర్ హిల్స్, ఎస్ఆర్ హిల్స్, న్యూ తిరుమలనగర్, హనుమాన్‌నగర్, శ్రీ వెంకటేశ్వర, ఎంఆర్ఆర్, జయశంకర్ తదితర కాలనీ సంఘాల అధ్యక్షులు, సభ్యులు మల్లారెడ్డితో కలిసి వినతి పత్రాలు సమర్పించారు. కాలనీలు ఏర్పడి దాదాపు పది సంవత్సరాలు కావస్తున్నా అభివృద్ధికి నోచుకోలేదని వారు కెఎల్ఆర్‌కు వివరించారు. అంతర్గత రహదారుల నిర్మాణం జరగలేదనీ పూర్తిస్థాయిలో భూగర్భ డ్రైనేజీ లేదనీ వారు తెలిపారు. ఈ నేపథ్యంలో కాలనీల్లో మౌళిక సదుపాయాలు, సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన కెఎల్ఆర్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నదని తెలిపారు. జిహెచ్ఎంసిలో విలీనమైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలలో కొత్తగా ఏర్పడిన డివిజన్ల అభివృద్ధికి బడ్జెట్ కేటాయించడం జరిగిందని తెలిపారు. అయితే తన దృష్టికి వచ్చిన అల్మాస్‌గూడ కాలనీల సమస్యలపై శంషాబాద్ జోనల్ కమీషనర్‌తో మాట్లాడి ప్రతిపాదనలు చేయించి జిల్లా ఇంఛార్జి మంత్రి శ్రీధర్‌బాబు ద్వారా నిధులు మంజూరయ్యేలా తన వంతు కృషి చేస్తానని కెఎల్ఆర్ వారికి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘాలకు సంబంధించిన తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, శివారెడ్డి, మల్లేష్, కృష్ణ, ఉమా మహేశ్వర్‌రావు, సత్యనారాయణ, శ్రీకాంత్, ఉపేందర్, యాదయ్య, ప్రభాకర్, శివకుమార్, విద్యాసాగర్, మురళి నాయక్, లింగయ్య నాయక్, మాధవరెడ్డి, సంజీవ, జంగయ్యగౌడ్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పాలనలోనే చెరువుల అభివృద్ధి : మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



గుర్రపు డెక్క తొలగించే పనులకు శ్రీకారం చుడుతున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జూలై 7 ప్రభాతవార్త:** చెరువుల్లో గుర్రపు డెక్క పెరగకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ మీర్‌పేట్ మంత్రాల చెరువులో పెరిగిన గుర్రపు డెక్కను తొలగించే పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. చెరువులో విస్తారంగా పెరిగి దుర్వాసన వెదజల్లుతూ దోమలకు నిలయంగా మారిన గుర్రపు డెక్క వల్ల పరిసర కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండంతో స్పందించిన ఆమె చర్యలు తీసుకొని డెక్కను తొలగించే ఏర్పాట్లు చేయించారు. అనంతరం సబి తారెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ నాయకత్వంలో కోట్లాది రూపాయలతో చెరువులను అభివృద్ధి చేస్తే నేడు కాంగ్రెస్ పాలనలో నిర్లక్ష్యానికి గురవుతూ మురికి కూపాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి, సిఎంగా కెసిఆర్ పాలనను చెరిపివేయాలని కాంగ్రెస్ పాలకులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలో గుండెల్లో నుండి మాత్రం తొలగించలేరని ఆమె స్పష్టం చేశారు. నాటి అభివృద్ధి, కెసిఆర్ పాలన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దీప్‌లాల్ చౌహాన్, అర్కల భూపాల్‌రెడ్డి, ఎనుగుల అనిల్ యాదవ్, అర్కల కామేష్‌రెడ్డి, దిండు భూపేష్‌గౌడ్, మాదరి రమేష్, రాజ్‌కుమార్, జె.శ్రీనివాస్ నాయక్, అబ్బనమోని గోపి యాదవ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అవినాశ్, సునీత బాలరాజ్, పంతంగి మాధవి వెంకటేశ్వ రరావు, నిర్మలారెడ్డి, బిందు,స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

### మంద కృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ పోరాటాలు చారిత్రాత్మకం



బాలాపూర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేస్తున్న రవిమాదిగ

**సరూర్‌నగర్, జూలై 7 ప్రభాతవార్త:** మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో జరిగిన ఎమ్మార్పీఎస్ పోరాటం చరిత్రలో చిర స్మరణీయంగా ఉంటుందని రంగారెడ్డి జిల్లా మాజీ అధికార ప్రతినిధి, బాలాపూర్ మండల ఇంఛార్జి బొర్ర రవి మాదిగ స్పష్టం చేశారు. ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా బడంగ్‌పేట్ సర్కిల్ లోని బాలాపూర్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

# గన్‌మెన్‌లను వెనక్కి తిరిగి పంపిన ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ప్రభుత్వం ఇచ్చిన గన్‌మెన్‌లను వెనక్కి పంపుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జూలై 7 ప్రభాతవార్త :**

తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన గన్‌మెన్‌లను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరోసారి తిరిగి పంపించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా తనకు ప్రజల ప్రేమాభిమానాలు, విశ్వాసమే నిజమైన భద్రత అన్నారు..ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యత అని, అదనపు భద్రత అవసరం లేదనే తన అభిప్రాయాన్ని మరోసారి వ్యక్తం చేశారు. ప్రజలతో నిత్యం మమేకమై, అందుబాటులో ఉంటూ సేవ చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా ప్రజలతో తన అనుబంధాన్ని, నిరాడంబరమైన ప్రజాసేవ పట్ల తన నిబద్ధతను మరోసారి చాటుకున్నారని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం : పరమేశ్వర్‌రెడ్డి



లబ్ధిదారులకు సిఎం సహాయనిధి చెక్‌లు అందజేస్తున్న పార్టీ ఇంచార్జ్ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జూలై 7 ప్రభాతవార్త :** సిఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు ఒక వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురికి సిఎం సహాయనిధి చెక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో సిఎం రేవంత్‌రెడ్డి అర్హులందరికీ కూడా సీఎంఆర్ఎఫ్ కింద మెడికల్ బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్‌కు రూ.లక్ష 30వేలు, మహమ్మద్ రఫీకి రూ.60 వేలు, బి.శ్రీనివాసరెడ్డికి రూ.60 వేలు, శ్రీకాంత్‌కు రూ.60వేలు, జె.వీరు రూ.34వేలు, బొర్రల అరుణకు రూ.27 వేల చొప్పున మంజూరైన చెక్కులను పరమేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు ఈగ ఆంజనేయులు ముదిరాజ్, బీరప్ప గడ్డ డివిజన్ అధ్యక్షుడు ఆకిటి ఆగం రెడ్డి, చిలకనగర్ డివిజన్ అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, బజార్ జగన్నాథ్ గౌడ్, రాజేష్, నవీన్ యాదవ్, కె.సతీష్ ముదిరాజ్, తూర్పాటి జంగయ్య, శ్రీరాములు, కాజా మూలన, సత్యనారాయణ, జగదీష్ ముదిరాజ్, శ్రీను, మంగళ నాగరాజ్, ఫహీమ్, వహీద్, తదితరులు పాల్గొన్నారు.

## 10న పోచమ్మ దేవాలయంలో నాగదేవత విగ్రహ పునః ప్రతిష్టాపన మహోత్సవం



కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ కి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దేవాలయం కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ తదితరుల

**మలక్ పేట, జూలై 7, ప్రభాతవార్త:** మలక్ పేట లోని శ్రీ పోచమ్మ దేవాలయంలో ఈనెల 10వ తేదీన నాగదేవత విగ్రహ పునః ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించనునట్లు దేవాలయం చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ లు తెలిపారు. దేవాలయంలో జరిగే నాగదేవత విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమానికి రావాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కికి వారు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌకి సురేష్ కుమార్ కమల దంపతుల ఆధ్వ ర్యంలో నాగదేవత విగ్రహ పునః ప్రతిష్టాపన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కావున భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# బూత్ స్థాయిలో బిజెపిని మరింత బలోపేతం చేయాలి

**: బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.రాంచందర్‌రావు

**సైదాబాద్, జులై 7 ప్రభాతవార్త:**

ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో బిజెపిని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి సభాధ్యక్షతన మంగళవారం బిజెపి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్, చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీ చేపట్టనున్న కార్యక్రమాలు, సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడం, సభ్యత్వ నమోదు, ప్రజా సమస్యలపై పోరాటాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. పార్టీ సిద్ధాంతాలను కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, కార్యకర్తలు, నాయకులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ జీ, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి, జాతీయ నాయకులు పేరాల శేఖర్‌జీ, మేడ్చల్ జిల్లా ఇంఛార్జి సామ రంగారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఒక్క సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమానం : ఏసిపి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసిపి కృష్ణయ్య,చిత్రంలో సీఐ మహమ్మద్ మక్బూల్‌జానీ

**ఎల్.బి.నగర్, జులై 7 ప్రభాతవార్త:** ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ప్రతి కాలనీలో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య సూచించారు. నేను సైతం 2.0 కార్యక్రమంలో నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తట్టిఅన్నారం డబుల్ బెడ్‌రూమ్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన 54 సీసీటీవీ కెమెరాలను ఏసీపీ కృష్ణయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణ, నేరపరిశోధనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు అత్యంత కీలకమన్నారు. సీసీటీవీ కెమెరాలు నేరాల నివారణ, నేరస్థుల గుర్తింపు, నేరాల పరిశోధనలో కీలక ఆధారాలుగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రతికాలనీ, అపార్ట్‌మెంట్, వాణిజ్య సంస్థలు సీసీటీవీ నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, పోలీసులకు ప్రజల సహకారం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాగోల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్‌జానీ, ఎస్ఐ శివనాగప్రసాద్, మాజీ కౌన్సిలర్ దేవిడి వేణుగోపాల్‌రెడ్డి, బ్లాక్ ఇన్‌చార్జ్‌లు రిజ్వాన్, భాస్కర్, దేవేందర్, మొహమ్మద్ ఖాతీజాబేగం పాల్గొన్నారు.

## రేపటి నుండి పోలింగ్ బూత్‌ల వద్ద హెల్ప్ డెస్క్‌లు : తహసీల్దార్ వేణుగోపాల్

**హుడాకాంప్లెక్స్, 7 జులై, ప్రభాతవార్త :**



స్పెషల్ ఇంటెన్సివ్ రివి జన్ (సర్) కార్యక్ర మాన్ని వేగవంతం చేయడంతో పాటు ఓటర్లకు మరింత సౌకర్యవం తమైన సేవలు అందించేందుకు రేపటి నుండి నియోజకవర్గం పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్ వద్ద ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయనున్నట్లు సరూర్‌నగర్ మండల తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. వీటి ద్వారా ఓటర్లు తమ ఓటరు జాబితా వివరాలను పరిశీలించుకోవడం, అవసరమైన ధరఖాస్తులను నింపడం, సంబంధిత పత్రాలను సమర్పించడం, ఓటరు జాబితాకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకోవ డం వంటి సేవలను ఒకే చోట పొందే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేకించి వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, ఇతర ఓటర్లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లే కుండా తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల వద్దే సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతి హెప్ప్‌డెస్క్ వద్ద సంబంధిత బీఎల్ఓ లు అందుబాటులో ఉండి ధరఖాస్తుల స్వీకరణ, పత్రాల పరిశీలన అవసరమైన సూచనలు అందిస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కు ను పరిరక్షించేకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. ఓటర్లు తమ అధార్ కార్డు, ఓటరు గుర్తిం పు కార్డు, నివాసద్రువీకరణ పత్రాలు, అవసరమైన ఇతర పత్రా లతో పోలింగ్ బూత్‌కు వచ్చి హెల్ప్ డెస్క్ సేవలను వినియోగిం చుకోవాలని అయన విజ్ఞప్తి చేశారు. ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఓలు పరస్పర సహకారంతో సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని తహసీల్దార్ వేణుగోపాల్ కోరారు.

### షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్టు నూతన కార్యవర్గం ఎన్నిక



**హుడాకాంప్లెక్స్,7 జులై, ప్రభాతవార్త :**

దిల్‌సుఖ్‌నగర్ శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్టు నూతన కార్యవర్గం ఎన్నుకోబడింది. సంస్థాన్ ట్రస్టు ఎన్నికల కమిటీ అధ్యక్షుడు ఎన్.శివారెడ్డి అధ్యక్షతన ఎన్నికలను నిర్వహించడం జరిగింది. ఓట్ల లెక్కింపు అనంతరం ఎన్నికల కమిటీ శివారెడ్డి, సత్యనారాయణరావు, పరమేశ్వర్‌లు ఫలితాలను వెల్లడించారు. ఛైర్మన్‌గా డాక్టర్ కె.లింగయ్య, వైస్ ఛైర్మన్1గా పూర నర్సింహ్మ గుప్తా, వైస్ ఛైర్మన్ 2గా పి.వీరప్ప , ప్రధాన కార్యదర్శిగా వి.వి.రవికుమార్, ఫైనాన్స్ సెక్రెటరిగా బి.కిరణ్‌కుమార్, జాయింట్ సెక్రెటరి 1గా కోడి రాజశేఖర్, జాయింట్ సెక్రెటరి2గా పి.క్రిష్ణవేణి, సభ్యులుగా పద్మాకర్ అత్రే, బి.వి.శ్యామ్‌కుమార్, యం.శ్యామలరావు, పి.లక్ష్మీదుర్గలు ఎన్నికయ్యారు.

### జిల్లా కలెక్టర్ మనుచౌదరితో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి



జిల్లా కలెక్టర్ మనుచౌదరితో బేటి అయిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**రామంతాపూర్, జూలై 7 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనూ చౌదరితో బేటి అయ్యారు. ఈ సందర్భంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని బీఎన్ రెడ్డి నగర్‌లో సుమారు 150 ఎకరాల యూఎల్‌సి భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీని వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తమ సొంత ఆస్తులపై రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని ఆయన వివరించారు. ఈ సమస్యను త్వరితగతిన పరిశీలించి, రిజిస్ట్రేషన్లు పునఃప్రారంభమయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం సమస్యను పరిశీలించి తగిన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ మనూ చౌదరి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## డబ్బుల వివాదం.. ఇల్లు వీడిన భార్య



**నేరేడ్ మెట్ , జూలై 7,ప్రభాతవార్త :** కుటుంబంలో డబ్బుల విషయంలో జరిగిన స్వల్ప వివాదం యువతి ఇంటిని విడిచి వెళ్లిపోవడానికి దారితీసింది. నేరేడ్మెట్ పోలీసుల వివరాల ప్రకారం.. దేవీనగర్‌కు చెందిన కుసోత్ బిల్లు తన భార్య మానస (23)తో కలిసి నివాసం ఉంటున్నాడు. దంపతుల మధ్య డబ్బుల విషయంలో సోమవారం స్వల్ప గొడవ జరిగింది. ఈ ఘటనతో మనస్తాపానికి గురైన మానస, భర్త ఇంట్లో లేని సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త బిల్లు నేరేడ్మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు మహిళ అదృశ్యమైన కేసు నమోదు చేసి, ఆమె ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.